## నారదుడు చెప్పిన నాంచారమ్మ కథలు-5

# చలనచిత్ర విచిత్రం

-చంద్రం

**నాంచారమ్మ** అంతగా చదువుకోలేదు. ఆమె భర్త పరిస్థితీ అంతే. ఆ కారణంగా తమ కన్న ఎక్కువ చదువుకున్నవారిని చూస్తే 'ఎలర్జీ' నాంచారమ్మకి. అవతలివారు సహృదయులూ. స్నేహశీలురూ అయినప్పటికీ. చదువుకున్న కారణాన వాళ్ళంతా ఆగర్భ శత్రువులలోనే జమ నాంచారమ్మకి. ఎట్టి పరిస్థితులలోనూ వాళ్ళను మరో దృష్టితో చూడలేదామె.

రెండవ వాటా పద్మావతి పదవ తరగతి చదువుకున్నది. ఆమె భర్త గ్రాడ్యుయేటు. ఆ వివరాలు తెలిసిన మరుక్షణంలోనే వాళ్ళిద్దర్నీ వైరి వర్గంలో చేర్చింది నాంచారమ్మ. పైకి వదినగారీ వరుసతో మాట్లాడుతున్నా. అంతర్గతంగా శత్రుభావం పెంచుకోసాగింది.

చీర వ్యవహారం బెడిసికొట్టింది. నాగమణితో పాటు వాటాలలోని వాళ్ళందరి ముందూ తల వంచుకోవాల్సి వచ్చింది. అందుకు కారకులెవరు?—అని ప్రశ్నించుకొంటే తిరుగులేని సమాధానంగా పద్మావతి కనిపించింది నాంచారమ్మకి.

అవును. ముమ్మాటికీ పద్మావతే కారణం. ఆమె చెప్పి ఉండకపోతే అది కోయంబత్తూరు చీర అని ఎవరికి తెలుస్తుంది? తనకు తెలీదు. అంతకు ముందు చూసిన వాళ్ళెవరికీ అలాంటి అనుమానం కలగలేదు. నాగమణి తప్ప మిగిలిన వాళ్ళంతా వచ్చి చూశారు కదా! తను బొంబాయి చీర అని చెప్పింది. వాళ్ళు నమ్మారు.

తన పరువు తియ్యాలన్న. దుర్బుద్ధి కాకపోతే. పని కట్టుకొని చీర మీద ముద్ర కోసం ఎందుకు వెదుకుతుందీ పద్మావతి?

ఈ ఊహ బుర్రలోకి రాగానే పద్మావతి పట్ల అంతకు ముందున్న శత్రుభావం ఒక్కసారే రెట్టింపయింది నాంచారమ్మకి. అసలే ఆమె అంటే కడుపు మంటగా ఉంది. ఈ సంఘటనతో అగ్నిలో ఆజ్యం పోసినట్లైంది.

పద్మావతి కావాలని తన పరువు తీసింది. తను చెయ్యలేదా ఆ పని? సాధించాలి. పద్మావతి పరువు పది మందిలో తియ్యాలి. అంతవరకు తనకు నిద్ర పట్టదు.

కాని. ఎలా?

అప్పుడెప్పుడో ఒకసారి పద్మావతి 'చదువు ఉండీ రికమెండేషన్ లేక. లంచం పెట్టలేక సరైన ఉద్యోగం సంపాదించుకోలేక పోయాం' అని మాటల సందర్భంలో తన భర్తను గురించి చెప్తే. 'ఆం-చదువుల్దేముంది? ప్రతివాడూ చదివేస్తున్నాడు. పొట్ట గడవటానికి ఉద్యోగం ప్రధానం. ఆ రోజుల్లోనే మామేనత్త కొడుకు ఎమ్. ఎ. చదివాడు. అయినా. ఉద్యోగం లేదని నన్ను అతనికివ్వకుండా ఎస్సైగారి కిచ్చి చేశారు మావాళ్ళు!' అని తడుముకోకుండా సమాధానం చెప్పింది నాంచారమ్మ.

ఇప్పుడు మాటలతో కాదు-చేతలతో చెప్పాలి సమాధానం.

ఎలా?

ఇట్నుంచి కుదరనప్పుడు అట్నుంచి నరుక్కురమ్మన్నారు పెద్దలు.

ప్రత్యక్షంగా శత్రువుని ఎదుర్కోలేనప్పుడు పరోక్ష మార్గాలు వెదుక్కోక తప్పదు.

ఒక రోజు—

పంపు కింద బిందె పెట్టి నించుంది పద్మావతి.

గబగబా ఖాళీ బిందె తీసుకొని వచ్చి "సినిమాకెళదాం వస్తారా. పద్మావతొదినగారూ!" అనడిగింది నాంచారమ్మ.

"రానొదినగారూ!" అనేసింది మామూలుగా పద్మావతి.

ఆశించిన సమాధానం వచ్చిందన్న సంతోషంతో "మీరు ఆ మాటే అంటారని తెలుసు లెండి. డబ్బుల కోసం బెంగ పెట్టుకోవద్దు. టిక్కెట్లు నేనే తీస్తాను" అన్నది చేతులు తిప్పుతూ. గట్టిగా నాంచారమ్మ.


పద్మావతి మనస్సు చివుక్కుమంది.

నాంచారమ్మ మాటలూ. చేతలూ. ప్రవర్తనా వింతగా ఉంటున్న సంగతి పద్మావతి గ్రహించలేకపోలేదు. కాని. ప్రతిసారీ ఆమె తత్త్వం అంతేలే—అని సరిపెట్టుకోవడం సాధ్యం కావటం లేదు.

"నేను రానన్నది డబ్బుల గురించి కాదొదినగారూ! సినిమాలకి మీ అన్నయ్యగారు. నేను కలిసి వెళుతుంటాం. విడిగా వెళ్ళే అలవాటు లేదు" అన్నది పద్మావతి సమాధానంగా.

దెబ్బ తిన్న పక్షిలా చూసింది నాంచారమ్మ. ఇది ఆమె ఊహించని సమాధానం. అయినా. గుక్క తిప్పుకుంది.

"మేమూ అంతే. కాని. ఎస్సై గారికి ఈమధ్య స్నేహితులు ఎక్కువైపోయి. వాళ్ళతోనే చూసేస్తున్నారు ప్రతి సినిమా అందుకని గాని. లేకపో





తే ఒంటరిగా వెళ్ళే కర్మ నాకు మాత్రం ఏం పట్టింది?" అని దీర్ఘం తీసి తన చర్యను సమర్థించుకోవటానికి ప్రయత్నించింది నాంచారమ్మ.

ఏ విషయాన్నీ అనవసరంగా సాగదీసే అలవాటు లేని పద్మావతి, నిండిన బిందె భుజానికెత్తుకొని వెళ్ళిపోయింది. ఆ పూట మళ్ళీ పంపు దగ్గరికి రాలే దామె.

తన డబ్బులతో పద్మావతిని సినిమాకి తీసుకెళ్ళి, అది ఆసరాగా చేసుకొని కొంత కథ నడిపించవచ్చునని నాంచారమ్మ ఆశ పడింది. కాని, నిరాశే ఎదురైంది. అది తట్టుకోవటానిగ్గాను ఆ రాత్రి సెకండ్ షోకి బయలుదేర దీసింది భర్తను.

"రెండో ఆట కెందుకూ, నిద్దర దండగ!" ఆవులిస్తూ అన్నాడు భజగోవిందం.

"ఒక్క రోజు నిద్ర చాలకపోతే ప్రాణాలు పోతాయా?" మండి పడింది నాంచారమ్మ.

"పోవనుకో. కాని, మధ్యాహ్నం చెప్పుంటే హాయిగా మొదటి ఆట సమయానికే వద్దును కదా అని!"

నిజమే. కాని, మధ్యాహ్నం తను మాత్రం అనుకుందా సినిమాకే వెళ్ళాల్సి వస్తుందని? పరిస్థితులు తోసుకొచ్చాయ్ అలా!

"పోనీ, రేపెళ్ళొచ్చుగా. ఇంతలోనే ముంచుకుపోయే దేముంది?" అన్నాడు బద్ధకంగా.

"ఇవ్వాళ అనుకున్న పని ఇవ్వాళే జరిగిపోవాలి. లేకపోతే నిద్రెలా పడుతుంది?"

అలాంటి పరిస్థితి అతనికి అంతకు మునుపెన్నడూ ఎదురవలేదు. కనుక, నిద్ర పడుతుందో, లేదో అతనికి నిజంగా తెలీదు. పైగా, మాట వరసకి ఏదో అన్నాడు గాని, తన మాట చెల్లదనీ, సినిమాకి వెళ్ళి తీరవలసిందే అనీ అతనికి నిశ్చయంగా తెలును. కనుక "త్వరగా తెములు మరీ!" అన్నాడు.

నాంచార మ్మొదినగారూ, ఎ స్సైగారూ కలిసి సినిమాకే వెళ్తున్న సంగతి వాటాల్లో వాళ్ళందరికీ తెలిసిపోయింది.

"పిల్ల లింటి దగ్గ రుంటారు. చూస్తుండండి, వదినగారూ!" అని సుశీలతోనూ, "రేపు కథ చెప్తాను లెండి, పిన్నిగారూ!" అని సుందరమ్మగారితోనూ చెప్పి "పదండీ-టైమైపోతోంది!" అని భర్తను హెచ్చరించి, హడావుడిగా బయలుదేరింది నాంచారమ్మ.

అంతకు గంటన్నర ముందు నుంచే బూబమ్మగారికీ, సాయిబుగారికీ ఘర్షణ జరుగుతోంది— సెకండ్ షో సినిమావిషయమై. వాళ్ళ కింకా రాజీ కుదరలేదు. పూర్తి సినిమాచూసే యోగం వాళ్ళ కెప్పుడుంది గనుక!

మరునటి రోజు ఉదయం పంపు దగ్గర ప్రారంభించింది నాంచారమ్మ—"మంచి స్టోరీ, మంచి కథా, గొప్ప మ్యూజిక్కూ, గొప్ప సంగీతం...చూసి తీరాల్సిన సినిమా పిన్నిగారూ!"

"నా కెక్కడ వీలవుతుందమ్మా?" చప్పరించేసింది సుందరమ్మ పిన్నిగారు.

"నిజమే, పిన్నిగారూ! ఇదివరకటి రోజులు కాదు. సినిమాటిక్కెట్ల రేట్లు విపరీతంగా పెంచేశారు. నాకూ, ఎ స్సై గారికీ కలిపి ఆర్రూపాయలైంది! నిద్రపోతారని పిల్లల్ని తీసుకెళ్ళలేదు గాని, లేకపోతే మరో తొమ్మిది రూపాయలై ఉండేది. నాకైతే బాల్కనీలో కూచుంటేనేగాని, సినిమా చూసినట్టుండదు. మొదట్నుంచీ అలవాటైపోయింది. తక్కువ క్లాసు టిక్కెట్లు కొంటే అన్ని రకాల మనుషుల మధ్యా కూచొని చూడాలి కదా!"

"కాదమ్మా మరి?"

"రానూ పోనూ రిక్షాలకి మూడు రూపాయలు, పిన్నిగారూ! మనూళ్ళో రిక్షా కిరాయిలు మరీ మండి పోతున్నాయి!"

"నిజమే నమ్మా!"

"తూర్పు వీధిలో ఉన్నప్పుడు మాకు వాడకంగా కట్టే రిక్షావాడు అందరికంటే ఒక పాపలా తక్కువ తీసుకొనే వాడు, పిన్నిగారూ!...డబ్బులైతే ముంది గాని, సినిమామాత్రం మాగొప్పగా ఉంది పిన్నిగారూ! సాయంత్రం తొందరగా పన్లు తెములుస్తాకొండి —కథ చెబుతాను."

"అలాగే నమ్మా!" అని బిందెత్తుకొని వెళ్ళిపోయింది సుందరమ్మ పిన్నిగారు.

అప్పుడే ఖాళీ బిందె తీసుకొని వచ్చింది బూబమ్మ.

"రాత్రి నేన్ పిల్‌స్తాను-మీరూ పల్కారు, నాంచారం వద్నాగారూ!"

"ఎక్కడొదిన గారూ?"

"సిన్మాహాల్ కాడా!"

"మీరూ వచ్చారా రాత్రి సినిమాకి?" అనుమానంగా అడిగింది నాంచారమ్మ.

"రాకాపోతే ఊర్కోర్‌గా మాసాయిబ్‌గారు! మీర్ ముందూ ఎళ్ళార్. మేమ్ తర్వాతా వచ్చామ్."


"ఎక్కడ కూచున్నారు మీరు?" నెమ్మదిగా అడిగింది నాంచారమ్మ.

"సాయిబ్‌గా రెప్పుడూ కుర్సీ టిక్కెట్లేగా కొంటార్. మేమ్ వచ్చేటప్పటికీ కుర్సీలన్నీ పైపోతే, ముందూ వర్సలో కూసున్నాం. బెంచీలో వెన్కా వర్సాలో మీర్ కూసున్నార్. మీకూ మాకూ గోడా అడ్డమ్. రెండూ సార్లూ పిల్‌స్తాను. మీరూ పల్కాలేరు. సిన్మాహాల్లో గొడ్వా ఏమ్టని సాయిబ్‌గారూ గదమ్కున్నార్...." బూబమ్మొదినగారు రాత్రి జరిగిన తతంగం యావత్తూ చెప్పుకుపోతున్నదీ గాని, నాంచారమ్మ పరిస్థితి గమనించలేదు.

'కుర్సీ టిక్కెట్లు' అన్న మాట పిడుగు పాటులా ధ్వనించి, తల తిరిగి కళ్ళు బైర్లు కమ్మేసినయ్ నాంచారమ్మకి. భూమి రెండుగా చీలితే సీతమ్మవారిలా నిరభ్యంతరంగా అందులో ప్రవేశించే పరిస్థితి నాంచారమ్మది. అయితే, భూమి చీలలేదు గనుక అందులో ప్రవేశించే అవకాశం ఆమెకు లేక పోయింది.

కొద్ది క్షణాల్లో తల తిరగటం తగ్గింది. కళ్ళు కూడా బాగానే పని చేసి, ఆ సమయంలో తనూ, బూబమ్మా తప్ప పంపు దగ్గర మరెవ్వరూ లేరన్న యథార్థాన్ని రూఢిగా బుర్రకు అందజేసినయ్. దానితో కొంత స్తిమితం కలిగి, తేరుకొని, తమాయించుకొని, క్షణాల్లో ఆత్మ రక్షణకు ఆయత్తమైపోయింది.

"ఎ స్సైగా రెప్పుడూ బాల్కనీ టిక్కెట్లే కొంటారు. బాల్కనీలో కూచుంటేనే గాని నాకు సినిమా చూసినట్టుండ దొదినగారూ! రాత్రి కూడా ఎ స్సైగారు బాల్కనీ టిక్కెట్లే కొన్నారు. తీరా లోపల కెళ్ళబోయే టప్పటికి, తూర్పు వీధిలో మాకు






తెలిసిన ఒకావిడ బెంచీ టిక్కెట్టుతో కనిపించింది. ఆవిడెప్పుడూ బెంచీకే వెళ్తుంది లెండి! చాలా కలుపుగోలు మనిషి. సరే. డబ్బులు పోతే పోయినయ్- కాలక్షేపంగా ఉంటుందని ఏ స్నైగార్నైక్కుర్నీ బాల్కనీలో కూచోమని. నే నావిడతో కలిసి బెంచీలో కూచున్నాను. కూచున్నా నన్న మాటే గాని. అలవాటు లేక ముళ్ళ మీద కూచున్నట్టుందంటే నమ్మండొదిన గారూ! ఎప్పుడు "సినిమా అయిపోతుందిరా భగవంతుడా అనిపించింది."

సుశీల రావటంతో చెప్తున్న మాట టక్కున అప్పుడే ఆపేసి. బిందెత్తుకొని వెళ్ళిపోయింది నాంచారమ్మ.

రాత్రి తను సినిమా హాల్లో. బెంచీ క్లాసులో కూర్చొని ఉండటాన్ని బూబమ్మ చూసేసింది. ఏదో తను సర్ది చెప్పుకొచ్చింది గాని. ఆ కథని బూబమ్మ నమ్ముతుందన్న నమ్మకం లేదు. నమ్మటం, నమ్మకపోవటం మాట అటుండనిచ్చి. ఆమె నోటి మీదుగా ఈ వ్యవహారం మిగిలిన వాటాల వాళ్ళందరికీ తెలిసిపోదన్న 'గ్యారంటీ' కూడా ఏమీ లేదు.

పరువు దక్కేదెలా?

బూబమ్మ కూడా సినిమా కొస్తుందని మాట మాత్రంగా తెలిసి ఉంటే. ముందే జాగ్రత్తపడి. మరో హాలుకు పోవటమో. మరేదో...చేసి ఉండేది.

ఏదో చెయ్యబోతే మరేదో అయింది. పద్మావతి చేసిన గాయం ఇంకా మానలేదు. ఇంతలోనే ఇదొచ్చిపడింది. దెబ్బ మీద దెబ్బ. విలవిలలాడిపోయింది నాంచారమ్మ.

బూబమ్మ నోటిలో నువ్వు గింజ నానదు. తప్పకుండా సినిమా వ్యవహారాన్ని యావన్మందికీ చాటింపు వేస్తుంది. తన పరువు నడిబజారులో వేలం పాడేస్తుంది. కనుక. ఆమెకు అవకాశం ఇవ్వకుండా ముందే తను జాగ్రత్తపడాలి.

ఎలా?

ముందు సుశీలను పట్టుకుంది. పద్మావతి కూడా వింటూండగా—"రాత్రి ఏం జరిగిందో చూశారా. వదినగారూ!—" అంటూ ప్రారంభించి. బూబమ్మకు చెప్పిన కథ అంతా విపులంగా వినిపించి. "బాల్కనీ టిక్కెట్టు కొన్నవాళ్ళు బెంచీలో కెళ్తామంటే సినిమా హాలు వాళ్ళు అడ్డు చెప్పరొదినగారూ!" అని ఆశ్చర్యపోతూ ముగించింది.

నాగమణితో ముఖాముఖీ మాటలు తగ్గిపోయినయ్ గనుక. నూతి పళ్ళెం దగ్గర సుందరమ్మ పిన్నిగార్ని నిలబెట్టి నాగమణిని కూడా దృష్టిలో ఉంచుకొని. కథ యావత్తూ బిగ్గరగా వినిపించి— "మూడు రూపాయలు పోసి బాల్కనీ టిక్కెట్టు కొని. మొహమాటం కోసం బెంచీలో కూచోవాల్సొచ్చింది. అన్నీ ఉన్నా అనుభవించే యోగం ఉండదంటారు— ఇంతే కదా. పిన్నిగారూ!" అని దీర్ఘంగా నిట్టూర్చింది.

"ఇంతేనమ్మా!" అని తనూ గట్టిగా నిట్టూర్చి. నిరభ్యంతరంగా తన అంగీకారాన్ని తెలియపర్చింది సుందరమ్మ పిన్నిగారు.

ఇది చలన చిత్ర విచిత్రం— అని అయిదవ కథ ముగించాడు నారదుడు.

"నాంచారమ్మ కల్పించి చెప్పిన కథ విన్నవాళ్ళు ఎంతవరకు నమ్మారంటావు. నారదా?" అడిగింది లక్ష్మీదేవి.

"కృష్ణావతారంలో మా తాతగారు సెలవిచ్చినట్టుగా తన వంతు కర్తవ్యం తాను నిర్వర్తించింది నాంచారమ్మ. పర్యవసానాన్ని కాలమే నిర్ణయిస్తుంది కదా. తల్లీ!"

"సరి సరి. చీర వ్యవహారంలో నాగమణి ముందు ఓడిపోయిన నాంచారమ్మ తిరిగి ఎలా నిలదొక్కుకున్నదీ వివరించాల్సి ఉంది నువ్వు!" గుర్తు చేశాడు విష్ణుమూర్తి.

"తప్పకుండా వివరిస్తాను. స్వామీ! నా ప్రయత్నమంతా అదే కదా! నాంచారమ్మకి దెబ్బ మీద దెబ్బ తగిలింది. పనిమనిషి వ్యవహారం బెడిసికొట్టింది. పాదసంవాహన రహస్యం బట్టబయలై కూర్చుంది. బొంబాయి చీర కథ రసాభాసు అయిపోయింది. చలన చిత్ర విచిత్రం చిత్రంగా ముగిసింది. ముందు ముందు ఇంకేం జరుగుతుందో అన్న కుతూహలం మీకు కలగటం సహజమే. ఆరవ కథ అవధరించండి!" ★

# బంగారం కావలిస్తే...

-డి. వి. ఆర్. భాస్కర శాస్త్రి

**బంగారం** కావలిస్తే బంగాళాఖాతంలో వెతుక్కోమన్నాడట ఆ మధ్య ఒక శాస్త్రవేత్త. ఆ మాట విన్న పెద్దమనిషికి విషయ మేమిటో తక్షణం అర్థం కాకపోయినా, తరువాత తెలిసింది సముద్ర జలంలో బంగారం ఉందని. అంటే ఉప్పుకొటారులలో ఉప్పు 'పండిస్తున్నట్టు' సముద్రంలోంచి నీళ్ళు తెచ్చుకొని. ఇగరబెట్టి బంగారం కూడా పండించుకోవచ్చని కాదు దాని అర్థం. అట్లా కాకపోతే సముద్ర జలంలో ఉన్న మామూలు ఉప్పుకే బంగారానికి ఉండే గిరాకీ త్వరలో వచ్చేస్తుందనా? కాదు. పరిశోధనలు, పరిశీలనలు ఇంకా ఆసక్తికరమైన విషయాలు తెలియజేస్తున్నాయి.

ఒక మైలు పొడుగు, మైలు వెడల్పు, మైలు ఎత్తు ఉన్న సముద్ర జల రాశిని తీసుకువచ్చి. దాన్ని విశ్లేషించి పరిశోధిస్తే ఆ నీటిలోంచి 25 టన్నుల బంగారం తీయవచ్చని ఒకాయన లెక్కకట్టాడు. భూగోళం పరిమాణంలో నాలుగింట మూడు వంతులు ఆక్రమించుకొని ఉన్న సముద్రం అంతటిలోను ఎన్ని వేల టన్నుల బంగారం ఉందో గణించవచ్చు కూడా.

ఒక మైలు నీటి ఘనంలో బంగారం 25 టన్నులు ఉంటుందనే పెద్ద అంకెలను మామూలు అంకెలలోకి మార్చి చూస్తే, పది లక్షల ఘన అడుగుల నీటిలో సుమారు పాతిక గ్రాములు అన్న మాట. ఈ అంచనానే ఒక బిలియన్ గ్రాముల నీటిలో కేవలం అయిదు గ్రాముల బంగారం ఉందని చెప్పవచ్చు.

ఈ బంగారాన్ని వెలికి తీసే కృషి మాట ఎట్లా ఉన్నా, సముద్రజలంలో ఇంతకంటే చాలా ఎక్కువ పరిమాణంలో ఉన్న ఇతర ఖనిజాలు సులువుగా తీస్తున్నారు. మామూలు ఉప్పు మాట సరేసరి. ఒక్క ఘనమైలు నీటిలోనే ఉండే సుమారు 13 కోట్ల టన్నుల ఉప్పు యావత్తు ప్రపంచ జనాభాకి అనేక సంవత్సరాలపాటు తినడానికి సరిపోతుంది.

ఉప్పు తరువాత చెప్పుకోవలసినది మెగ్నీషియం. ఇది ప్రతి వెయ్యి కిలోగ్రాముల నీటిలోను ఒక కిలోగ్రాం దాకా ఉంటుంది. సముద్రపు నీటికి సున్నం కలిపి మెగ్నీషియాన్ని క్షారంగా రాబట్టి, అందులోంచి లోహాన్ని విడదీస్తున్నారు. ఉక్కుతో పోలిస్తే అయిదు రెట్లు తేలికగా ఉండటంవల్ల ఈ లోహాన్ని తేలికగా, దృఢంగా ఉండే వాహనాలకీ, సాధనాలకీ, విమాన భాగాలకీ వాడుతున్నారు. మరొక ముఖ్య సముద్ర ఖనిజం బ్రోమిన్. అమెరికా వంటి సంపన్న దేశాలు ఈ ఖనిజాలను సముద్ర జలంలోనుంచే తీసుకొని వినియోగించుకుంటున్నాయి. సముద్ర జలంలో కనీసం 72 రకాల రసాయన మూలకాలు కొద్దో గొప్పో ఉన్నాయంటే కొంచెం వింతగానే అనిపిస్తుంది. అసలు సముద్రానికి ఈ ఖనిజ సంపద ఎక్కడనుంచి వచ్చినట్టు?

లక్షలకొద్ది సంవత్సరాలనుంచి అతి ప్రాచీన శిలలు, కొండరాళ్ళు శిథిలమై, వాటిలో ఉన్న ఖనిజ లవణాలు వాననీటితోపాటు నదులలో సముద్రానికి చేరుతూ ఉన్నాయి. భూమి గత చరిత్ర పరిశీలిస్తే గుట్టలు, కొండలు, పర్వతాలు ఇట్లా వాగునీటివల్ల, వాన నీటివల్ల శతాబ్దాలుగా శిథిలమవుతూ ఉన్నాయి. ఆ నీటిలో రాతి ఖనిజాలు కరిగి, ప్రవాహంలో సముద్రానికి అనాదిగా చేరుతున్నాయి. ఇవికాకుండా సముద్ర గర్భం లోపల ఉన్న శిలలు కరిగి, అవి ఆ నీటికి సమకూరుస్తున్న లవణాలు మరికొన్ని. ఇంతేకాకుండా తూర్పు దీవుల్లో అగ్నిపర్వతాలు పేలడం వల్ల సముద్రానికి చేరే రకరకాల మాలిన్యాలు, ఖనిజాలు, లవణాలు ఆ నీటికి తమ తమ లక్షణాలు అందిస్తున్నాయి.

రసాయనవేత్తల అంచనాలనుబట్టి సముద్రాలలో ఏభై క్వాడ్రిలియన్ ($50 \times 10^{24}$) టన్నుల లవణాలు కరిగి ఉన్నాయి. వీటి నంతటినీ ఇగిర్చివేసి, లవణా లన్నింటిని విడదీసి భూమి మీద అంతటా పరిస్తే, ఆ లవణాల పొర మందం అయిదు వందల అడుగుల దాకా ఉంటుందట! ★